క్లుప్తంగా

శివరాత్రి పూజల్లో పెద్దిరెడ్డి దంపతులు



దేవళంపేట కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ పూజల్లో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి దంపతులు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని చిచ్చిలివారి పల్లెలో వెలసిన మల్లికార్జునస్వామి, దేవళంపేటలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాల్లో శివ రాత్రి సందర్భంగా బుధవారం జరిగిన పూజల్లో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఆలయాల్లో ఆయన స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజల్లో పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి కుటుంబీకులు పాల్గొన్నారు.

నేడు సీతమ్మగుట్ట తిరునాళ

సదుం: మండలంలోని సీతమ్మగుట్ట వద్ద గురువారం తిరునాళ జరగనుంది. శివరాత్రి మరుసటి రోజు గుట్టపై తిరునాళ నిర్వహించడం ఆనవాయితీ. భక్తులు గుట్టపై ఉన్న సీతమ్మ, శివాలయాలను, గుట్ట కింద ఉన్న ఆంజనేయ, వినాయకస్వామి ఆలయాలను సందర్శించి, మొక్కులు చెల్లిస్తారు. ఇందుకోసం నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. తిరునాళకు వచ్చే భక్తుల కోసం అన్నదానం చేస్తున్నట్లు చెప్పారు.

దరఖాస్తు చేసుకోండి

శాంతిపురం: తులసినాయనపల్లి వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూలులో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎండీకేవీ లత బుధవారం తెలిపారు. ప్రస్తుతం ఐదవ తరగతి చదువుతున్న, లేదా పూర్తి చేసిన విద్యార్థులు ఈనెల 31లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎస్సీ, ఎస్టీలు రూ 75, ఇతరులు రూ.150 దరఖాస్తు రుసుం చెల్లించాలని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2011 సెప్టెంబర్ 1 నుంచి, ఇతరులు 2013 సెప్టెంబర్ 1 నుంచి 2015 ఆగస్టు 31లోపు పుట్టి ఉండాలని తెలిపారు.

పలమనేరు బస్టాండ్ తనిఖీ

- మోడల్ బస్టాండ్లుగా కుప్పం, పలమనేరుకు అవకాశం
- చిత్తూరు ఆర్టీసీ డీపీటీఓ జగదీష్

పలమనేరు: పలమనేరు ఆర్టీసీ బస్టాండులోని సౌకర్యాలు, ఇబ్బందులను చిత్తూరు జిల్లా డీపీటీఓ జగదీష్ బుధవారం పరిశీలించారు. ఇక్కడి వసతులు, మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్లు, మూత్రశాలలను పరిశీలించారు. ఆర్టీసీకి సంబంధించిన ఖాళీ గదులు ఎన్ని ఉన్నాయి, ఆర్టీసీ ద్వారా సాగుతున్న పార్శిల్ సిస్టం ఎలా నడుస్తోందని గమనించారు. ఇక్కడున్న సౌకర్యాలు బాగాలేవని బస్టాండులోని పలువురు ప్రయాణికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వీటిపై చర్యలు తీసుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ కుప్పం, పలమనేరు బస్టాండ్లను మోడల్ బస్‌స్టేషన్లుగా మార్చే ప్రతిపాదన ప్రభుత్వం వద్ద ఉందన్నారు. దీనిపై ఉన్నతాధికారుల నిర్ణయంతో ఆధారపడి ఉంటుందన్నారు. తమ పరిధిలోని సమస్యలకు వెంటనే పరిష్కరించేందుకు చొరవ చూపుతామని తెలిపారు.

తమిళ డేటా ఎంట్రీ పోస్టుకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని నిరుద్యోగులకు సీతమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో తమిళ డేటా ఎంట్రీ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఏజీఎస్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ నిర్వాహకులు రూపేష్‌బాబు బుధవారం తెలిపారు. ఈ పోస్టులకు మార్చి 1వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 100 పోస్టుల భర్తీకి చర్యలు చేపడుతున్నామన్నారు. నెలకు రూ.17,500 జీతం ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 08572–234531ను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

రంకెలేసిన పౌరుషం

వడమాలపేట (విజయపురం): మహాశివరాత్రి పురస్కరించుకొని వడమాలపేట మండలం బాలినాయుడుకండ్రిగలో బుధవారం కోలాహలంగా జల్లికట్టు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. 100కు పైగా ఎద్దులను తీసుకొచ్చి జల్లికట్టు నిర్వహించారు. ఓ ఎద్దు బావిలో పడిపోవడంతో జేసీబీ యంత్రం సాయంతో వెలికి తీశారు.

యూరియా బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలి

బంగారుపాళెం: యూరియా బ్లాక్ మార్కెట్‌ను అరికట్టి రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులోకి తీసుకురావాలని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో రైతులు యూరియా అందుబాటులో లేక ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ డీలర్లతో కుమ్మక్కై యూరియాను బ్లాక్ మార్కెట్‌లో అమ్మిస్తున్నారని చెప్పారు. 45 కిలోల బస్తా రూ.226.50కు విక్రయించాల్సి ఉండగా బయట రూ.380కు విక్రయిస్తున్నట్లు తెలిపారు. అధికారులు బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాల్సిన అవసరం ఉందని చెప్పారు.

హరహర మహాదేవ



కోటి లింగేశ్వరస్వామి ఆలయంలో భారీ శివలింగం






పలమనేరు: లింగోద్భవ అభిషేకం, చెన్నారెడ్డిపల్లి కాశీవిశ్వేశ్వరస్వామి, కల్లూరు: చంద్రమౌళీశ్వర ఆలయంలో.., అబకలదొడ్డిలో..




కుప్పం: ప్రత్యేక అలంకరణలో తిమ్మరాయ, దొడ్డ తిమ్మరాయస్వామి, చౌడేపల్లె శివాలయంలో..



ఊరేగుతున్న కాశీ విశ్వేశ్వరుడు



బైరెడ్డిపల్లెలో..



పుంగనూరులోని భోగనంజుండేశ్వరస్వామి

- ఘనంగా మహాశివరాత్రి వేడుకలు
- కిటకిటలాడిన శివాలయాలు
- కనులపండువగా కల్యాణం

మహాశివరాత్రిని పురస్కరించుకొని బుధవారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివరాత్రి సందర్భంగా శివపార్వతులకు కనులపండువగా కల్యాణం నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని పునీతులయ్యారు.

పలమనేరు: పట్టణంలోని శ్రీ కాశీవిశ్వేశ్వరాలయం శివనామస్మరణలతో హోరెత్తింది. లింగోద్భవ అభిషేకం జరిపారు. ఆలయం వద్ద పండరి భజనలు, శివకోటి ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. కూర్మాయిలోని శ్రీమహాలింగేశ్వరస్వామి ఆలయం, తొప్పనపల్లిలోని శ్రీ కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, పెంగరగుంట క్రాస్‌లో యోగశివుని విగ్రహం వద్ద ఘనంగా మహాశివరాత్రి ఉత్సవాలు జరిగాయి.

కుప్పం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని శివాలయాల్లో శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని సోమేశ్వర స్వామి దేవాలయం, పెద్దపల్లి గంగమ్మ దేవస్థాన ప్రాంగణంలోని తిమ్మరాయ, దొడ్డ తిమ్మరాయ స్వామి దేవాలయాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కురబ కులస్తులు తిమ్మరాయ, దొడ్డ తిమ్మరాయస్వామి దేవాలయాల్లో తలపై కొబ్బరి కాయలు కొట్టుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: చెన్నారెడ్డిపల్లి కాశీవిశ్వేశ్వరస్వామి, వీరప్పల్లి యోగనందీశ్వర స్వామి, కోగిలేరు జలకంఠేశ్వరస్వామి, రాయలపేట బసవేశ్వరస్వామి, బొమ్మరాజుపల్లి కాలభైరవేశ్వరస్వామి ఆలయాలు భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి. కోగిలేరు జలకంఠేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.



సదుం: నాగమల్లేశ్వరస్వామి

పులిచెర్లలో..

పులిచెర్ల(కల్లూరు): కల్లూరులోని చంద్రమౌళీశ్వర స్వామి, జాండ్రపేటలోని త్రిపురాసుందరి ఆలయం, మల్లిం కొండలోని మల్లీశ్వరస్వామి, దేవళంపేటలోని కాశీ విశ్వేశ్వరస్వామి, చిచ్చిలివారిపల్లెలోని మల్లికార్జునస్వామి ఆలయాల్లో ఘనంగా నిర్వహించారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: చీలంపల్లె సమీపం కపిలేశ్వరస్వామి ఆలయం, నాగిరెడ్డిపల్లె సమీపం సోమేశ్వరస్వామి ఆలయం, పాతపేటలోని చెన్నమల్లికార్జునస్వామి, పాతురునత్తంలో వెలసిన రేవణసిద్ధేశ్వరస్వామి, బైరెడ్డిపల్లెలోని పార్వతీ పరమేశ్వరస్వామి, కోట్రే పల్లె సమీపంలోని శ్రీ కాళభైరవేశ్వరస్వామి ఆలయాల్లో ఘనంగా నిర్వహించారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: పెద్ద గొట్టిగల్లు సమీపంలో ఓంకారేశ్వర ఆలయంలో సాయంత్రం శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులు ఆలయంలో ఏర్పాటు చేసిన 101 శివలింగాలకు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మోటుమల్లెల శివాలయం, కట్టకింద శివాలయంలో ఘనంగా నిర్వహించారు.

గుడుపల్లెలో..

గుడుపల్లె: మల్లప్పకొండపై వెలసిన శ్రీ స్వర్ణగిరి మల్లేశ్వరస్వామి ఆలయం శివనామస్మరణంతో మార్మోగింది. రాత్రి స్వామి వారిని ఆలయం చుట్టూ పురవీధుల్లో ఊరేగించారు. అదేవిధంగా గుడివంక గంగాధరేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. రాత్రి ద్రౌపదీ సంరక్షణ నాటకాన్ని ప్రదర్శించారు.



పెంగరగుంట క్రాస్‌లో యోగశివుడు



కుప్పం: తలపై టెంకాయలు కొట్టుకుంటున్న కురబ కులస్తులు

సదుంలో..

సదుం: ఎర్రాతివారిపల్లె నాగమల్లేశ్వరస్వామి, కన్యమూల వినాయకస్వామి, మత్తుకువారిపల్లె సమీపంలోని మల్లేశ్వరస్వామి, స్థానిక వీరభద్ర స్వామి, మరకతేశ్వరస్వామి, అరుణాచలేశ్వరస్వామి, పుట్టావారిపల్లె మల్లికార్జునస్వామి, పాతపేట ఎల్లమ్మ ఆలయాల్లో ఘనంగా నిర్వహించారు.

శాంతిపురంలో..

శాంతిపురం: అబకలదొడ్డి, తుమ్మిశి, రాళ్లబూదుగూరు, జంగాలపల్లి, గుండిశెట్టిపల్లి, ఎంకే పురంలోని శివాలయాలకు భక్తులతో కిటకిటలాడాయి. వేడుకలను ఘనంగా నిర్వహించారు.

పుంగనూరులో..

పుంగనూరు: పట్టణంలోని శ్రీ కాశివిశ్వేశ్వరస్వామి, నగరి వీధిలోని సోమేశ్వరస్వామి, బోగనుండేశ్వర స్వామి, నెక్కుందిలో గల శ్రీ అగస్తీశ్వరస్వామి, యాబైరాళ్ల మరవలోని మరవేశ్వర స్వామి, భీమగానిపల్లెలోని భీమేశ్వర స్వామి ఆలయాల్లో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: స్థానిక శ్రీఅభీష్టద మృత్యుంజయేశ్వర స్వామి, పుదిపట్లలోని పంచలింగేశ్వరస్వామి, యర్రపల్లె వద్ద గల శ్రీబసవేశ్వరస్వామి ఆలయాలు శివనామస్మరణలతో మారుమోగాయి. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

వి.కోటలో..

వి.కోట: పట్టణంలోని ఈశ్వర్‌నగర్, దాసార్లపల్లిలో వెలసిన కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాల్లో ఘనంగా నిర్వహించారు. కమ్మసంద్రంలో వెలసిన కోటిలింగేశ్వర క్షేత్రంలో భక్తులు పోటెత్తారు.



రొంపిచెర్ల: ఓంకారేశ్వర ఆలయంలో..



మల్లప్పకొండలో క్యూలో భక్తులు

అనాథకు అంతిమ వీడ్కోలు



అంత్యక్రియలను నిర్వహించిన హెల్పింగ్‌హ్యాండ్స్ నిర్వాహకులు

పలమనేరు: మూడు రోజుల క్రితం పట్టణంలో మృతిచెందిన అనాథకు పట్టణానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకులు బుధవారం స్థానిక హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలను నిర్వహించారు. స్థానిక ఎంఎం రత్నం వీధిలో యాచన చేసుకుంటూ బతుకుతున్న ఓ 47 ఏళ్ల వ్యక్తి అదే వీధిలో మూడు రోజుల క్రితం అనాథగా మృతిచెందాడు. స్థానికుల సమాచారంతో ఇక్కడి పోలీసులు సమాచారం ఇచ్చారు. దీంతో వారు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి అతని కుటుంబీకులు, బంధువుల ఆచూకీ కోసం వేచి చూసి ఎవరూ రాకపోవడంతో మున్సిపల్ సిబ్బంది ద్వారా అంత్యక్రియలకు అనుమతినిచ్చారు. ఇలాంటి అనాథ శవాలకు అంత్యక్రియలను నిర్వహించే స్థానిక హెల్పింగ్‌హ్యాండ్స్ నిర్వాహకులు ఆ శవానికి అంత్యక్రియలను నిర్వహించారు. ఆఖరి మజిలీని శివ, శక్తి, జీలు, నరేంద్ర పోలీసుల సమక్షంలో చేశారు.

వైభవంగా కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో స్వామి అమ్మవారు

గుడిపాల: మహాశివరాత్రి పురస్కరించుకొని మండలంలో 197రామాపురంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో బుధవారం గోవిందమాంబ, వీరబ్రహ్మేంద్రస్వామికి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి కాగడా హారతి సమర్పించి స్వామివారికి ప్రత్యేకపూజలు చేశారు. ఉత్సవమూర్తులకు గోవిందమాంబ వీరబ్రహ్మేంద్రస్వామి వారికి తిరుమంజన సేవ నిర్వహించి ఆలయ ప్రాంగణంలో వేదమంత్రాల నడుమ మంగళవాయిద్యాల మధ్య కల్యాణోత్సవం వైభవంగా సాగింది. మహాలక్ష్మి కుంకుమార్చన చేసి ముత్తైదువులందరికీ పసుపు కుంకుమ, బొందారం అందజేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త బ్రహ్మయ్య తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం భజన కార్యక్రమాలు నిర్వహించారు.

టీబీ అలర్ట్ ఇండియా ఆరోగ్య శిబిరం



అవగాహన కల్పిస్తున్న వైద్య బృందం

గుడిపాల: మండలంలోని బొమ్మసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న కుప్పిగానిపల్లెలో రచ్చబండ వద్ద టీబీ అలర్ట్ ఇండియా సహకారంతో బుధవారం ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ క్యాంపులో 115 మందికి టీబీ, అస్తమా, బీపీ, మధుమేహంతోపాటు ఇతర రక్త పరీక్షలు, ఆరోగ్య సమస్యలపై స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. డాక్టర్ రష్మిత మాట్లాడుతూ బీసీజీ వ్యాక్సిన్ 18 నుంచి 60 ఏళ్లపైబడిన వాళ్లు తప్పక వేసుకోవాలన్నారు. 23 మందికి శ్వాసకోశ సమస్యలను గుర్తించి, 11 గళ్ల పరీక్ష శాంపిల్స్ సేకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మధుసూదన్‌రాయల్, టీమ్ అలర్ట్ ఇండియా ఫీల్డ్ ఆఫీసర్ సోమశేఖర్, సూపర్‌వైజర్ లక్ష్మి, మోహన్, కమలమ్మ, వైద్యసిబ్బంది శిల్ప, దివ్య, సరస్వతి, కవిత, సుభాషిణి, సరళ, భాగ్యం పాల్గొన్నారు.

దమ్ముంటే పట్టుకో!

- అధికారులకు సవాల్ విసురుతున్న ఇసుకాసురులు
- నదికి సమీపంలో భారీగా ఇసుక డంప్‌లు
- కౌండిన్య నుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- అధికారులకు తెలిసినా పట్టించుకోని వైనం
- గుట్టుచప్పుడు కాకుండా కర్ణాటకకు తరలింపు



పలమనేరు బైపాస్ రోడ్డు సమీపంలోని కౌండిన్య నదికి ఆనుకొని దాచిన ఇసుక దంపు

పలమనేరు: పలమనేరు రెవెన్యూ డివిజన్‌లో కూటమి పేరు చెప్పుకొని కొందరు ఇసుకాసురులు కౌండిన్య నదిలోని ఇసుకను తరలించి భారీగా డంపులు పెట్టారు. ఇక ఎన్నటికీ ఇసుక దొరకదేమోనన్నంతగా నిత్యం ఇసుకు తోడి డంపులకు చేర్చడమే లక్ష్యంగా మారింది. ఇసుక అమ్మకాల మాట దేవుడెరుగు ముందుగా నదిలోని ఇసుకను దొరికినంత దోచుకోవడం కోసం ఒకరి మీద మరొకరు పోటీలు పడి ఇసుకను పోగేసుకుంటున్నారు.

కౌండిన్య నదికి ఆనుకుని ఉన్న గ్రామాల్లో కొందరు కూటమి పేరు చెప్పుకొని అప్పులు చేసి ట్రాక్టర్లు, జేసీబీలను తెచ్చి ఇసుకను తోడేస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో వ్యవసాయ పనులకు సైతం కూలీలు రావడం లేదు. ఎందుకంటే ఇసుక తవ్వకాలకు వెళితే పూటకు రూ.500కు పైగా దక్కుతోంది. కౌండిన్యలోంచి నిత్యం హైవే మీదుగానే ట్రాక్టర్లలో ఇసుక తరలుతున్నా అధికారులకు నదిలో ఇసుక ఉచితమని చంద్రబాబే చెప్పాడంటూ అసలు పట్టించుకోవడం లేదు. దీంతో ఇక్కడి ఇసుకాసురుల వ్యాపారం ఆరు ట్రాక్టర్లు.. పన్నెండు టిప్పర్లుగా మారింది. ఈ ప్రాంతానికి సమీపంలో కర్ణాటక రాష్ట్ర సరిహద్దు ఉంది. దీంతో డంపులో దాచిన ఇసుకను గుట్టుచప్పుడు కాకుండా కర్ణాటకకు చేర్చేస్తున్నారు

భారీగా ఇసుక నిల్వలు

పుష్ప సినిమాలో హీరో చెప్పిన చందంగా ఇసుకాసురులు సైతం ఎవరో దమ్ముంటే పట్టుకోండంటూ భారీగా ఇసుక డంపులను సిద్ధం చేసుకున్నారు. గంగవరం మండలంలో కౌండిన్య నదికి ఆనుకుని ఉన్న జీడిమాకులపల్లి, బైపాస్ రోడ్డు, క్యాటిల్‌ఫామ్, రామాపురం పొలాలు, మారేడుపల్లి, ముబ్బువాళ్లపేటతోపాటు పలమనేరు మండలంలోని మొరం, కూర్మాయి, జల్లిపేట, మునలిమొడుగు, పెద్దపంజాణి మండలాల్లోని 20 దాకా గ్రామాల్లో భారీగా ఇసుక డంపులున్నాయి.

సరిహద్దు దాటితే టిప్పర్ రూ.30 వేలకు పైమాటే....

ఎక్కువ మంది ఇసుకాసురులు భారీగా ఇసుకను తోడేయడంతో ఇసుకకు డిమాండ్ కాస్త తగ్గింది. ఇసుక కావాలంటే ఆయా ప్రాంతాలకు చెందిన కూటమి నేతలను కాంట్రాక్ట్ చేస్తే చాలు ఇసుక ఎంత కావాలన్నా రవాణా చేసేస్తున్నారు. ఇక భారీగా ఉన్న డంపులను రాత్రిపూట కర్ణాటకకు చెందిన టిప్పర్లతోనే ఇసుకను హోస్‌కోట్ వ్యాపారులకు అమ్మేస్తున్నారు. ఇక్కడ టిప్పర్ రూ.24 నుంచి 28 దాకా కొనే కర్ణాటక వ్యాపారులు అక్కడ రూ.35 వేలకు పైగా అమ్ముతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 8నెలల్లోనే పలమనేరు డివిజన్‌లోని 400 మంది ఇసుకాసురులు లక్షాధికారులుగా మారిపోయారంటే ఇసుక వ్యాపారం ఏ రేంజ్‌లో సాగుతుందో అధికారులే ఆలోచించాల్సిన అవసరం ఉంది.